# బీఆర్‌ఎస్‌లోకి ఆటో యూనియన్ నాయకులు



పటేల్‌నగర్‌లో ఆటోయూనియన్ నాయకులను
బీఆర్‌ఎస్ పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడుతున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

- కార్పొరేటర్ విజయ్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరిక
- సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నచ్చి పార్టీలో చేరుతున్నట్లు వెల్లడి

గోల్నాక, అక్టోబర్ 10 : అంబర్‌పేట డివిజన్‌లో వివిధ పార్టీల నుంచి నేతల చేరికలు భారీగా కొనసాగుతున్నాయి. తాజాగా మంగళవారం అంబర్‌పేట డివిజన్ పటేల్‌నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పటేల్ నగర్‌కు చెందిన పలువురు ఆటోడ్రైవర్ యూనియన్ నాయకులు కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వీరిని కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ...ఓ వైపు సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు.. మరో వైపు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పలు పార్టీల నాయకులతో పాటు పలు సంఘాల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరడం సంతోషంగా ఉందని న్నారు. బీఆర్‌ఎస్ నాయకులు దయాకర్‌యాదవ్, ఆదిల్, జమీల్ పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం



దత్తాత్రేయ కూతురు హరణికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు

అంబర్‌పేట / గోల్నాక, అక్టోబర్ 10 : ఈనాడు దినపత్రిక హిమాయత్‌నగర్ సీనియర్ రిపోర్టర్ డి.దత్తాత్రేయ (53) ఇటీవల గుండెపోటుతో ఆకస్మిక మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ మంగళవారం దత్తత్రేయ కుటుంబ సభ్యులను పరామర్శించారు.దత్తాత్రేయ కూతురు హరణికి రూ.50వేల నగదును అందజేసి అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు.

**కార్పొరేటర్ దూసరి లావణ్యాగౌడ్ రూ.20వేల నగదు..**

రిపోర్టర్ దత్తత్రేయ కుటుంబ సభ్యులను గోల్నాక డివిజన్ కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్ పరామర్శిచారు. దత్తాత్రేయ కుటుంబ సభ్యులకు ఆమె రూ.20వేల ఆర్థిక సాయం అందజేశారు.

**ఎమ్మెల్యేను కలిసిన జైస్వాల్‌గార్డెన్ ప్రతినిధులు..**

జైస్వాల్‌గార్డెన్‌కు చెందిన ప్రతినిధులు మంగళవారం ఉదయం ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌ను కలిశారు. కాలనీలో గల మైసమ్మ దేవాలయం వద్ద దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని అందుకు తమ సహకారం కావాలని కోరారు. అందుకు ఎమ్మెల్యే సమ్మతించారు. కాలనీ ప్రతినిధులు రామగౌడ్, యాదవరెడ్డి, రమేశ్, ప్రసన్నాంజనేయులు తదితరులు ఉన్నారు.

## నందికంటి శ్రీధర్‌కు ఆత్మీయ సన్మానం

కాచిగూడ, అక్టోబర్ 10: ఎంబీసీ కులాల చైర్మన్‌గా బీఆర్‌ఎస్ నాయకుడు నందికంటి శ్రీధర్ నియమితులైన సందర్భంగా ఎంబీసీ కులాల ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ ఉదయం 11 గంటలకు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలంగాణ బీసీ జాగృతి అధ్యక్షుడు మురళీకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్, బీసీ సమాజ్ అధ్యక్షుడు సంగం సూర్యారావు, ఎంబీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ప్యారాసాని బాలరాజ్ పాల్గొంటారని మురళీకృష్ణ పేర్కొన్నారు. ఈ ఆత్మీయ సన్మానంలో ఎంబీసీ కుల సోదరులు పాల్గొని, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## ఫ్లెక్సీలు తొలగింపు..



అంబర్‌పేటలో పోస్టర్లు తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

అంబర్‌పేట, అక్టోబర్ 10 : తెలంగాణలో ఎన్నికల నగారా మోగడంతో కోడ్ అమల్లోకి వచ్చింది. ఈ నేపథ్యంలో అంబర్‌పేట నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో వెలిసిన వివిధ పార్టీల ఫ్లెక్సీలు, వాల్ పోస్టర్లు, గోడలపై రాతలు, జెండాలను తొలగించాలని ఆదేశాలు రాగా, జీహెచ్‌ఎంసీ సిబ్బంది వెంటనే నియోజకవర్గంలోని కాచిగూడ, నల్లకుంట, గోల్నాక, అంబర్‌పేట, బాగ్ అంబర్‌పేట తదితర ప్రాంతాల్లో వెలిసిన ఫ్లెక్సీలు, వాల్‌పోస్టర్లు, జెండాలను తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. మంగళవారం 324 పోస్టర్లను తొలగించారు. అనుమతి లేకుండా పోస్టర్లు, ఫ్లెక్సీలు, జెండాలు ఏర్పాటు చేయవద్దని అధికారులు తెలిపారు.

## కాచిగూడలో వాహనాల తనిఖీ..



బర్కత్‌పురలో కారును తనిఖీ చేస్తున్న కాచిగూడ ఎస్సై నరేశ్, సిబ్బంది

కాచిగూడ,అక్టోబర్ 10: రానున్న అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని అసెంబ్లీ పరిధిలో ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలో భాగంగా కాచిగూడ ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణరాజు ఆదేశాల మేరకు ఎస్సైలు పి.రవి కుమార్, హెచ్.నరేశ్ ఆధ్వర్యంలో బర్కత్‌పుర చమాన్‌లో కాచిగూడ పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా కాచిగూడ, బర్కత్‌పుర రోడ్డుపైన వెళ్తున్న అనుమానం వచ్చిన ప్రతి వాహనాన్ని ఆపి పోలీసులు తనిఖీ చేపట్టారు. అసెంబ్లీ ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా ప్రతి వాహనదారుడు పాటించాలని, లేనియెడల చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాచిగూడ పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## యోగాతో మానసిక ఆరోగ్యం : మహేంద్రకుమార్



డాక్టర్ మహేందర్ కుమార్ రెడ్డిని సన్మానిస్తున్న లయన్ ప్రతినిధులు

కవాడిగూడ, అక్టోబర్ 10: యోగాతో మానసిక ఆరోగ్యం ఉంటుందని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ జి. మహేంద్రకుమార్, ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డాక్టర్ హిప్నో పద్మా కమలాకర్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా నవ భారత్ లయన్స్ క్లబ్, యోగా గురువులైన బొబ్బిలి సరోజిని, బి. రామారావుల ఆధ్వర్యంలో ఇందిరాపార్కులో మానసిక సమస్యలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆహార పరిశుభ్రత మనసును ప్రభావితం చేస్తుందని అన్నారు. బాహ్య పరిశుభ్రతతో పాటు మనసులోని క్లేశాలను తొలగించుకొని, మనో శుభ్రతను కూడా పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ జేటీ విద్యాసాగర్, జోనల్ చైర్‌పర్సన్ లయన్ సీహెచ్ గోపాల కృష్ణ, లయన్ బెల్లంకొండ వినయ్, డాక్టర్ స్వరూపరాణి, లయన్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శిగా నిరంజన్‌పోలె



నిరంజన్ పోలెను సన్మానిస్తున్న
బీఆర్‌ఎస్ నాయకులు గోనె ప్రదీప్‌రావు, వి.రవీందర్‌రావు

అంబర్‌పేట, అక్టోబర్ 10 : బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శిగా బాగ్‌అంబర్‌పేటకు చెందిన కార్మిక నాయకుడు నిరంజన్‌పోలె నియమితులయ్యారు. బీఆర్‌టీయూ హైదరాబాద్ అధ్యక్షునిగా కొనసాగుతున్న నిరంజన్‌ను తెలంగాణ భవన్‌లో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో కార్యదర్శిగా అధ్యక్షుడు రాంబాబుయాదవ్ నియమించారు. ఈ సందర్భంగా నిరంజన్ మాట్లాడుతూ.. తనను రాష్ట్ర కార్యదర్శిగా నియమించిన అధ్యక్షుడు రాంబాబుయాదవ్, ప్రధాన కార్యదర్శి వేముల మారన్నలకు ధన్యవాదాలు తెలిపారు. ఇదిలా ఉండగా అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గోనె ప్రదీప్‌రావు, వి. రవీందర్‌రావు, టి.రమేశ్ నిరంజన్‌ను అభినందించి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌టీయూ అనుబంధ సంఘాల నాయకులు నిమ్మల యాదగిరి, నల్గొండ నరేందర్, మేడే యాదగిరి, సర్పంచ్ వెంకన్న, నిమ్మకాయల వెంకటేశ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

## వేర్వేరు రైళ్లలో దొంగతనం

కాచిగూడ,అక్టోబర్ 10: విశాఖపట్నం రైల్లో ప్రయాణిస్తున్న ప్రయాణికుని బ్యాగులోంచి గుర్తుతెలియని వ్యక్తులు బంగారు ఆభరణాలు, నగదును తస్కరించాడు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నంలోని అక్కయ్యపాలెం ప్రాంతానికి చెందిన శ్రీనాథ్(43) ప్రైవేటు ఉద్యోగి. కాచిగూడకు రావడానికి ఈ నెల 8వ తేదీన విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో కాచిగూడ-విశాఖపట్నం రైలెక్కాడు. మార్గమధ్యంలో చూసుకునేసరికి 30 గ్రాముల బంగారు ఆభరణాలు,రూ.12 వేల నగదు, ఫోన్ కన్పించలేదు. మంగళవారం రాత్రి కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో శ్రీనాథ్ ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం కాజీపేట రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణచారి తెలిపారు.

## హజ్రత్ నిజామొద్దీన్ రైల్లో..

హజ్రత్ నిజామొద్దీన్ రైల్లో ప్రయాణిస్తున్న ప్రయాణికురాలి బ్యాగులోంచి గుర్తుతెలియని వ్యక్తులు నగదు, చేతిగడియరాన్ని తస్కరించాడు. రైల్వే సీఐ ఎల్లప్ప వివరాల ప్రకారం.. శేరిలింగంపల్లిలోని గుల్‌మోహార్ పార్క్ కాలనీకి చెందిన శ్వేత. కాచిగూడకు రావడానికి ఈ నెల 8వ తేదీన హజ్రత్ నిజామొద్దీన్ రైలెక్కింది. మార్గమధ్యంలో చూసుకునేసరికి రూ.5 వేల నగదు, రూ.20 వేల విలువ చేసే చేతిగడియారం కన్పించలేదు. మంగళవారం రాత్రి రైల్వే పోలీస్‌స్టేషన్‌లో శ్వేత ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం ఢిల్లీ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణచారి తెలిపారు.

## బీసీల సంక్షేమానికి గణేశాచారి సేవలు మరువలేనివి



కుందారపు గణేశ్‌ను బొకేతో సత్కరిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

కవాడిగూడ, అక్టోబర్ 10: బీసీల సంక్షేమానికి అహర్నిషలు కృషి చేస్తున్న కుందారం గణేశాచారి సేవలు మరువలేనివని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం దోమలగూడలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో బీసీ కులాల సంక్షేమానికి కృషి చేస్తున్న బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారపు గణేశాచారిని ఆయన షాలువా, బొకేతో సత్కరించారు. ఈ కార్యకరమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు విక్రంగౌడ్, మాదాసు రాజేందర్, ఈడిగ శ్రీనివాస్, గూడూరు భాస్కర్, మాధవి తదితరులు పాల్గొన్నారు.